# జనరల్ స్టడీస్

## ఇండియన్ ఎకానమీ

### భారత్ – ఆరోగ్య రంగం

**విద్య, వైద్య ఆరోగ్య రంగాలు మానవ వనరుల అభివృద్ధిలో అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. ఈ రంగాలు సమకూర్చే లాభాలు ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా పనిచేస్తాయి. ఆర్థికాభివృద్ధి సాధనకు ఆరోగ్యవంతమైన మానవ వనరులు చాలా అవసరం. దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యం, అస్పృశ్యతలకు ప్రధాన కారణాలు- ప్రజల్లో నిరక్షరాస్యత, చైతన్యం లేకపోవడం, ఆర్థిక సమస్యలు, పేదరికం, అసమానతలు, వైద్య సౌకర్యాలు కొరత మొదలైనవి.**

దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం ప్రధాన ఆరోగ్య సూచికలు కింది విధంగా ఉన్నాయి. మరణాల రేటు 1000 మంది జనాభాకు 27.4, జీవన ప్రమాణాల స్థాయి కేవలం 32 ఏళ్లు మాత్రమే ఉండేది. సుమారు 10 కోట్లమంది మలేరియా వ్యాధిబారిన పడేవారు. వీరిలో ఏటా 10 లక్షల మంది మరణించేవారు. అప్పటి జనాభాలో క్షయ కారణంగా ఏటా 5 లక్షల మంది మరణించేవారు.

★ ప్రతి 6430 మంది ప్రజలకు ఒక సుశిక్షితుడైన వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉండేవాడు.

★ శిశు మరణాల రేటు ఎక్కువగా ఉండేది.

### ప్రణాళికల ప్రారంభం - ఆరోగ్యరంగ స్థితి

★ ప్రణాళికలు 1951లో ప్రారంభమయ్యాయి. ఈ కాలంలో 725 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 9209 వైద్యశాలలు, 1,17,198 రోగుల పడకలు, 18,054 మంది నర్సులు ఉన్నారు. అల్లోపతి వైద్యులు 61,800 మంది ఉన్నారు. ఇవి 2010 నాటికి (1) ఆసుపత్రులు 19,786; (2) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు - 23,390; (3) ఉప కేంద్రాలు - 1,46,006; (4) కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు- 4276; (5) స్వచ్ఛంద ఆరోగ్య సంస్థలు - 7002; (6) డిస్పెన్సరీలు - 24,847; (7) పడకలతో కూడిన ఆస్పత్రులు - 8,16,274 ఉన్నాయి. ఇదేకాలంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగ వైద్యశాలల్లో పడకలు 1.17 లక్షల నుంచి 9.15 లక్షలకు పెరిగాయి. నర్సుల సంఖ్య, అల్లోపతి వైద్యుల సంఖ్య పెరిగింది. ప్రధానంగా మలేరియా, కుష్టువ్యాధి, పోలియో తగ్గుముఖం పట్టాయి.

### ప్రణాళికలు - ఆరోగ్య రంగం కేటాయింపులు

భారతదేశంలో ఆరోగ్య రంగానికి ప్రభుత్వం చేస్తున్న వ్యయం స్థూల జాతీయ ఉత్పత్తిలో దాదాపు 1.2 శాతం మాత్రమే. ప్రపంచంలో ఇదే అతి తక్కువ బడ్జెట్. ఏటా ప్రజలు వైద్య సౌకర్యాలు పొందడానికి సుమారు రూ. 1,00,000 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఇది ప్రభుత్వం చేస్తున్న వ్యయం కంటే దాదాపు 3 రెట్లు ఎక్కువ.

★ 1990 లో జీడీపీలో 1.3 శాతం ఉన్న ఆరోగ్యరంగ కేటాయింపులు 2000 నాటికి 0.9% తగ్గాయి.

★ ప్రపంచ ఆరోగ్య సంస్థ (World Health Organisation - WHO) ప్రతి దేశం తన స్థూల దేశీయ ఉత్పత్తి (GDP)లో 5% ఆరోగ్య రంగానికి కేటాయించాలని నిర్దేశించింది.

★ దేశంలో ఏడాదికి ప్రభుత్వం కేటాయిస్తున్న తలసరి ఆరోగ్య నిధులు సగటున రూ. 160 మాత్రమే. మిగిలిన వ్యయాన్ని ప్రజలే భరిస్తున్నారు. దేశంలోని ప్రయివేటు రంగంలోని వైద్య సేవలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. దీంతో ప్రయివేటు ఆరోగ్యసేవల భారం పెరిగి గ్రామీణ పేదలకు అందుబాటులో ఉండటం లేదు.

★ ప్రభుత్వం వివిధ పంచవర్ష ప్రణాళికల్లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు చేస్తున్నా అవి సరిపోవడం లేదు. ఇప్పటివరకు చేసిన అన్ని కేటాయింపుల్లో మొదటి ప్రణాళిక (1951-56) లో అత్యధిక శాతం (సుమారు 3.32%) ఆరోగ్య రంగానికి చేశారు. ఇది సుమారు రూ. 65.2 కోట్లు.

పంచవర్ష ప్రణాళికలు

ఆరోగ్యరంగానికి కేటాయింపులు (రూ.కోట్లలో)

| **ప్రణాళిక** | **కాలం** | **ఆరోగ్య రంగ కేటాయింపులు** | **మొత్తంలో శాతం** |
|---|---|---|---|
| 1వ | 1951–56 | 65.2 | 3.32 |
| 2వ | 1956–61 | 140.8 | 3.01 |
| 3వ | 1961–66 | 225.9 | 2.63 |
| వార్షిక | 1966–69 | 140.2 | 2.12 |
| 4వ | 1969–74 | 335.5 | 2.12 |
| 5వ | 1974–79 | 760.8 | 1.92 |
| వార్షిక | 1979–80 | 223.1 | 2.83 |
| 6వ | 1980–85 | 1821.1 | 1.86 |
| 7వ | 1985–90 | 3392.9 | 1.88 |
| వార్షిక | 1990–92 | 1965.6 | 1.6 |
| 8వ | 1992–97 | 7575.9 | 1.74 |
| 9వ | 1997–2002 | 1553.46 | 2.3 |
| 10వ | 2002–07 | 58920 | 2.1 |
| 11వ | 2007–12 | 140135 | 2.4 |

★ 10 వ ప్రణాళిక (2002–07) లో రూ. 58,920 కోట్లు ఆరోగ్య రంగానికి కేటాయించారు. ఇది మొత్తం ప్రణాళికలో సుమారు 2.1%.

★ 11వ ప్రణాళిక (2007 – 12) లో మొత్తం బడ్జెట్ రూ. 1,40,135 కోట్లు కాగా ఆరోగ్య రంగానికి 2.4 శాతం కేటాయించారు.

★ ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మనదేశం ప్రజారోగ్యం కోసం చేసే వ్యయం చాలా తక్కువ. అమెరికా మొత్తం ప్రభుత్వ వ్యయంలో ఆరోగ్య రంగానికి 18.6% కేటాయిస్తుంది. కొన్ని అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో ఆరోగ్య రంగంపై చేస్తున్న ప్రభుత్వ వ్యయాలను కింది పట్టికలో చూడవచ్చు.

**ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయం**

| దేశం | వ్యయం (మొత్తంవ్యయంలో శాతం) |
|---|---|
| భారత్ | 2.4 |
| బంగ్లాదేశ్ | 5.3 |
| పాకిస్థాన్ | 2.05 |
| జర్మనీ | 20.1 |
| అమెరికా | 18.6 |
| బ్రిటన్ | 15.7 |
| కోస్టారికా | 28.8 |
| శ్రీలంక | 6.2 |

## భారత ప్రజారోగ్యం – ముఖ్య సూచికలు

భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన ముఖ్య సూచికల్లో జనన, మరణాల రేట్లు, శిశు మరణాలు, మాతృ మరణాలు, ఆయుర్దాయం మొదలైనవి ముఖ్య సూచికలు. కింది పట్టిక 1951 నాటికి, ప్రస్తుతం ఈ సూచికల స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుపుతుంది.

| చలాంకం | గణన | 1951 | 2011 |
|---|---|---|---|
| జననాల రేటు | ప్రతి 1000 జనాభాకు | 40.8 | 21.8 |
| మరణాల రేటు | ప్రతి 1000 జనాభాకు | 25.1 | 7.1 |
| సంతానోత్పత్తి రేటు | ప్రతి స్త్రీకి | 6.0 | 2.5 |
| తల్లి మరణాల రేటు | ప్రతి లక్షకు | – | 212 |
| శిశు మరణాల రేటు | ప్రతి 1000 జననాలు | 146 | 44 |
| **ఆయుర్దాయం** | ఏళ్లలో | 36.7 | 66 |
| పురుషులు | " | 37.2 | 64.6 |
| స్త్రీలు | " | 36.2 | 67.7 |

## ముఖ్యమైన ఆరోగ్య పథకాలు

**1. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (NRHM)**

★ ఈ పథకాన్ని 2005 ఏప్రిల్ 12 న ప్రారంభించారు.

★ ఈ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు సమర్థమైన వైద్యసేవలు అందేలా చూస్తుంది.

★ ఆరోగ్య సూచికలు తక్కువగా ఉన్న ప్రాంతాలు, అల్ప మౌలిక సౌకర్యాలున్న 18 రాష్ట్రాల ప్రజలపై శ్రద్ధ వహిస్తారు.

★ 2005 – 15 మధ్యకాలంలో ఈ పథకం అమల్లో ఉంటుంది.

**2. జననీ సురక్ష యోజన:**

★ NRHM మొదటి దశలో భాగంగా పునరుత్పత్తి శిశు ఆరోగ్య పథకం – 2 ను ప్రారంభించారు. దీన్నే జననీ సురక్ష యోజనగా వ్యవహరిస్తున్నారు. ఈ పథకంలో దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకుంటే రూ. 700 నగదు ప్రోత్సాహకంగా ఇస్తారు.

**3. జననీ శిశు సురక్షా కార్యక్రమం:** ఈ పథకాన్ని 2011 జూన్ 1 న ప్రారంభించారు. దీని కింద సిజేరియన్ ఆపరేషన్‌తోపాటు ప్రసూతి ఖర్చులు ఉచితంగా అందిస్తారు.

**4. రాష్ట్రీయ ఆరోగ్య నిధి (RAN):**

ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1997 లో ఈ నిధిని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 2009 లో కాన్సర్ రోగి నిధిని ప్రారంభించారు.

**5. పల్స్ పోలియో టీకాల కార్యక్రమం:** ప్రపంచ ఆరోగ్య సభ తీర్మానం - 1988 ని అనుసరించి ఈ పథకాన్ని 1995 లో ప్రారంభించారు. 0 – 5 ఏళ్ల పిల్లలకు పోలియో రాకుండా నివారించడం దీని ఉద్దేశం. పోలియోను పూర్తిగా నివారించిన దేశంగా భారత్ ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందింది.

| **12వ ప్రణాళిక – ఆరోగ్యరంగం, లక్ష్యాలు (2012 – 17)** | |
|---|---|
| 12 వ ప్రణాళిక, 2017 నాటికి కింది లక్ష్యాలు సాధించాలని నిర్ణయించింది. | |
| **1.** శిశు మరణాల రేటు: | 25 |
| **2.** ప్రసూతి మరణాల రేటు: | 1 |
| **3.** 0 – 6 సంవత్సరాల బాలబాలికల నిష్పత్తి: | 950 |
| **4.** సంతానోత్పత్తి రేటు: | 2.1 |
| **5.** 0 – 3 ఏళ్ల పిల్లల్లో పౌష్టికాహార సమస్యలను 50% తగ్గించాలి. | |

| 2013–14 సర్వే ఆరోగ్య సూచికలు – రాష్ట్రాలు | | |
|---|---|---|
| సూచిక – (స్థితి) | ఎక్కువ | తక్కువ |
| శిశుమరణాలు (42) | మధ్యప్రదేశ్ (56)<br>అసోం (55)<br>ఒడిశా, యూపీ (53) | కేరళ (12) |
| జననాల రేటు (21.6) | బిహార్ (27.7) | కేరళ (14.9) |
| మరణాల రేటు (7.0) | ఒడిశా (8.5) | మహారాష్ట్ర, పశ్చిమ బంగా (6.3) |

## నమూనా ప్రశ్నలు

**1.** జాతీయ మలేరియా నియంత్రణ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

1) 1950　2) 1951　3) 1952　4) 1953

**2.** కుటుంబ నియంత్రణ శాఖను ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1) 1960　2) 1961　3) 1962　4) 1965

**3.** గ్రామీణ ఆరోగ్య పథకం ఎప్పుడు ప్రారంభమైంది?

1) 1967　2) 1977　3) 1987　4) 2007

**4.** నూతన జాతీయ జనాభా విధానాన్ని ఏ సంవత్సరంలో ప్రకటించారు?

1) 1976　2) 1986　3) 2000　4) 2008

**5.** జననీ సురక్షా యోజన ఎప్పుడు ప్రారంభమైంది?

1) 2001　2) 2005　3) 2004　4) 2003

**6.** రాష్ట్రీయ ఆరోగ్యనిధిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1) 1997　2) 1996　3) 1995　4) 1985

**7.** జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?

1) 1962　2) 1982　3) 1972　4) 1992

**8.** జాతీయ అంధత్వ నివారణ పథకం ప్రారంభమైన సంవత్సరం ఏది?

1) 1966　2) 1967　3) 1976　4) 1986

**9.** పల్స్ పోలియో ఎప్పుడు ప్రారంభమైంది?

1) 1965 2) 1975 3) 1995 4) 1980

**10.** జననీ శిశు సురక్ష పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

1) 2010 2) 2012 3) 2011 4) 2013

**11.** జాతీయ పోషకాహార విధానాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?

1) 1993 2) 1995 3) 1994 4) 1996

**12.** జాతీయ ఎయిడ్స్ నియంత్రణ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

1) 1960 2) 1978 3) 1987 4) 1997

**13.** శిశు రక్షణ, బాలింతల రక్షణ పథకాన్ని ఎప్పుడు ప్రకటించారు?

1) 1991 2) 1992 3) 1993 4) 1994

**14.** సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల పథకం ఎప్పుడు ప్రారంభమైంది?

1) 1983 2) 1984 3) 1985 4) 1996

**15.** మొదటి జాతీయ ఆరోగ్య విధానాన్ని ఎప్పుడు ప్రకటించారు?

1) 1991 2) 1993 3) 1983 4) 1963

**16.** అంధత్వ నియంత్రణ జాతీయ పథకం ఎప్పుడు ప్రారంభమైంది?

1) 1976 2) 1966 3) 1986 4) 1996

**17.** జాతీయ క్షయ నియంత్రణ పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?

1) 1968 2) 1962 3) 1972 4) 1982

**18.** జాతీయ కుష్ఠు వ్యాధి నియంత్రణ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

1) 1954 2) 1955 3) 1966 4) 1976

**జవాబులు**

1-4; 2-2; 3-2; 4-3; 5-2; 6-1; 7-2; 8-3; 9-3; 10-3; 11-2; 12-3; 13-2; 14-3; 15-3; 16-1; 17-2; 18-2.

**రచయిత: దాసరి రాజేందర్**

www.eenadupratibha.net